క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ నేత మొయిళ్ల సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'నారాయణ'లో క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను బజాజ్ అలయన్జ్ సంస్థ అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంపికలకు 250 మంది హాజరయ్యారు. అర్హత సాధించిన విద్యార్థులకు వార్షిక వేతనంగా రూ.5.9 లక్షలను అందించనున్నామని సంస్థ ప్రతినిధి అరుణ్ మిశ్రా తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డీన్ ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

నెలూరు(బారకాసు): మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, సీఐటీయూ నెల్లూరు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ధర్నాను ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం కమిషనర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, దేశమూర్తి, సీఐటీయూ నేతలు కిష్టయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

స్థల విషయమై వివాదం

నెల్లూరు(క్రైమ్): టెక్కేమిట్టలో స్థల విషయమై వివాదం చెలరేగింది. వివరాలు.. టెక్కేమిట్టలోని రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ఓ స్థల విషయమై మల్లికార్జున, వరలక్ష్మి దంపతులు.. మాగుంటలేఅవుట్‌కు చెందిన ఓ వ్యక్తి నడుమ కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఇరువర్గాలు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు సైతం చేసుకున్నారు. సదరు స్థలం ప్రైవేటుదా లేదా ప్రభుత్వ స్థలమానని నిర్ధారించేందుకు స్థానిక తహశీల్దార్‌కు రిపోర్టును పోలీసులు పంపారు. ఈ క్రమంలో సదరు స్థలంలో ఉన్న తమ గుడిసెను స్థానికంగా ఉన్న కొందరు తొలగించారని మల్లికార్జున దంపతులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ ఎ.మహేష్ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ద్వారా లబ్ధిపొందిన వారిని గురువారం ఆయన కలిశారు. పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుమ్మలదిబ్బ బీసీ కాలనీలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. కొత్తూరు దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

అసిస్టెంట్ కలెక్టర్ జి.విద్యాధరి కోవూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. శిక్షణలో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావుతో పలు విషయాలపై చర్చించారు. ఆమె వెంట ఎస్సై రమ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుధీర్ పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాళెంలో గురువారం రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులు ఉపయోగపడుతాయని చెప్పారు. మొత్తం మూడు అర్జీలు వచ్చాయని, వీటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్, వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



మహాకుంభాభిషేకం



పూజలకు హాజరైన భక్తులు

నెల్లూరు రూరల్: పడారుపల్లిలో కొలువైన గంగమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని విశేష పూజలను గురువారం నిర్వహించారు. బింబోత్థాపన, శిఖర, యంత్ర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, తదితరాలను జరిపారు.

కుర్తాళ సిద్ధేశ్వరి పీఠ పండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కాకుటూరు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీయే లక్ష్యం



జగనన్న భవన్ ప్రారంభ సందర్భంగా పూజలు



భారీ గజమాలతో రూప్‌కుమార్‌యాదవ్‌కు సత్కారం

- డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్
- జగనన్న భవన్ ప్రారంభం

నెలలూరు(దర్గామిట్ట): రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. జేమ్స్ గార్డెన్‌లో జగనన్న భవన్‌ను వేద మంత్రోచ్చారణలతో గురువారం ప్రారంభించారు. అనంతరం నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పార్టీ నేతలతో కలిసి విలేకరులతో రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. జగనన్న భవన్ పేరిట తన కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు.

ఘన సన్మానం

భారీ క్రేన్ సాయంతో రూప్‌కుమార్‌యాదవ్‌ను గజమాలతో అభిమానులు, పార్టీ నేతలు సత్కరించారు. సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మూలస్థానేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, నాగమణి, తహసీన్, పార్టీ నేతలు గోగుల నాగరాజు, దార్ల వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, గంగవరపు శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్‌ను జయించొచ్చు



మాట్లాడుతున్న లక్ష్మి

నెల్లూరు (అర్బన్): ముందస్తు పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను జయించొచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ సర్వైవర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాధిని జయించిన వారు, రోగులకు అవగాహన సదస్సును పొదలకూరు రోడ్డులోని ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 35 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారైనా ముందస్తు పరీక్షలను చేయించుకోవాలని కోరారు. కేన్సర్ బారిన పడి కోలుకున్న 30 మంది తమ అనుభవాలను పంచుకున్నారు. రేడియేషన్ ఆంకాలజిస్ట్ గీతా ఉషశ్రీ, డాక్టర్లు లోకేశ్వరి, తేజేశ్వర్, జనరల్ మేనేజర్ జుబేర్, కౌన్సెలర్ కన్యాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి గురువాయూర్ మహావిష్ణు బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 10 నుంచి 15 వరకు నిర్వహించనున్నామని అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం 6.30కు విశేష పూజలు, అంకురార్పణను నిర్వహించనున్నామని చెప్పారు. 11న ఉదయం 8.30కు ధ్వజారోహణం, రాత్రి 7.30కు శేషవాహన సేవను నిర్వహించనున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు విశేషంగా తరలిరావాలని కోరారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి సభ్యులు మోహన్‌రావు, రమణయ్య, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌కు అత్యాధునిక చికిత్స



మాట్లాడుతున్న అపోలో వైద్యులు

నెల్లూరు (అర్బన్): మెదడులోని ట్యూమర్లు, కణితిలకు నగరంలోని అపోలో హాస్పిటల్లో అత్యాధునిక వైద్య చికిత్సలను అందిస్తున్నామని న్యూరో సర్జన్లు ఆనంద్, రమణమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకొని హరనాథపురంలోని ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రెయిన్ ట్యూమర్‌ను తొలగించేందుకు అవసరమైన పరికరాన్ని నెల్లూరులోనే ప్రవేశపెట్టామని చెప్పారు. సాధారణంగా మెదడులో ప్రైమరీ, సెకండరీ కణితిలు ఉంటాయని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకంగా మారే అవకాశం ఉందని చెప్పారు. తలనొప్పి, మూర్ఛ, వాంతులు, నీరసం, మానసిక సమస్యలు, తదితరాలుంటే బ్రెయిన్ ట్యూమర్ ఉండేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే న్యూరలాజికల్, సిటీ స్కాన్, బయాప్సీ పరీక్షను చేయించుకోవాలని కోరారు. తమ హాస్పిటల్లో అత్యంత నైపుణ్యం కలిగిన డాక్టర్లు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, అన్ని రకాల వైద్య పరికరాలు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్జరీ చేసి ట్యూమర్లను తొలగిస్తామని వివరించారు. న్యూరో సర్జన్లు యశ్వంత్ సందీప్, ఉబేద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు

నెల్లూరు (అర్బన్): రోజురోజుకూ పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ దీక్షాంతి నారాయణ్ పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మెదడులో కణితి ఉంటే తలలో ఒత్తిడి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, వాంతులు, తదితర లక్షణాలు కనిపించే అవకాశం ఉందన్నారు. ఇలాంటివి కనిపిస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉండే న్యూరాలజిస్ట్‌ను కలిసి వైద్య చికిత్సను పొందాలని కోరారు.

మెడికవర్ ఆస్పత్రిలో 24 గంటలూ నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యూరోసర్జన్ దినేష్, న్యూరాలజీ డాక్టర్ వైష్ణవి, డాక్టర్లు ధీరజ్, కృష్ణచైతన్య, రాజేష్‌రెడ్డి, ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ

నెల్లూరు(బారకాసు): నగరంలోని 47 / 1, 2 గిడ్డంగివీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలోని నోటీస్ బోర్డు, ఇన్‌స్పెక్షన్, హాజరు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గడువులోపు పూర్తి చేయాలని చెప్పారు. సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నగరంలోని 11, 13, 14, 16వ డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టడంతో పాటు సిల్టు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

నగరపాలక సంస్థ పరిధిలో రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలపై చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. పాత జెడ్పీ కార్యాలయం, బారకాసు రోడ్డులోని ఆక్రమణలను ఆయన పరిశీలించారు.

త్వరితగతిన రీ సర్వే పూర్తి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో అత్యాధునిక డ్రోన్ సేవలను వినియోగించి రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. డ్రోన్‌తో రీ సర్వేను నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, డ్రోన్ ఏజెన్సీ బృందంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని 154 చదరపు కిలోమీటర్ల మేర సర్వేను చేపట్టనున్నామని తెలిపారు. ఆస్తి కలిగిన ప్రతి ఒక్కరికీ రీ సర్వే ఆధారిత శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామని వివరించారు. కార్యక్రమానికి సహకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డ్రోన్ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ నిర్వాహకుడు బ్రదర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు హాజరయ్యారు. డేవిడ్, కుసుమకుమారి, జయప్రకాష్, రమ, క్రాంతికుమార్, ధర్మారావు, సిస్టర్ రూబీ, డేవిడ్, మానస, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కపాడిపాళెంలో ఇంటింటి ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు గురువారం నిర్వహించారు. పార్టీ నేతలు డాక్టర్ యశోధర, మరియమ్మ, రాజమ్మ, గీత, కేజియా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగునకు వినతి

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు వద్ద పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మెరుగునకు చర్యలు చేపట్టాలని ముస్లిం మతపెద్దలు కోరారు. ఈ మేరకు మేయర్ స్రవంతికి వినతిపత్రాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బక్రీద్‌ను ఈ నెల పురస్కరించుకొని ప్రార్థనలకు ముస్లింలు భారీగా వస్తారని, ఈ క్రమంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి, గుర్రపు డెక్కను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కాగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మేయర్ హామీ ఇచ్చారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించి మెరుగైన వైద్యసేవలను అందించేలా కృషి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, ఆరోగ్యశ్రీ, సుస్థిర అభివృద్ధి సూచీలు, తదితరాలపై సమీక్ష జరిపిన అనంతరం ఆయన మాట్లాడారు. మాతాశిశు మరణాలను తగ్గించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేసి అనీమియా రాకుండా చూడాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా వైద్యపరీక్షల కోసం వచ్చిన వారిలో బీపీ, షుగర్, టీబీ, తదితర వ్యాధులను గుర్తించి వారి వివరాలను సంబంధిత యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బాలింతలకు రిజిస్ట్రేషన్ దశ నుంచి చెకప్, డెలివరీ అయి వారు ఇంటికి చేరేంత వరకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో ఇమ్యూనైజేషన్ నూరు శాతం అమలయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం



నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో నెలకొన్న డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శాంతినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన పలు సమస్యలను తెలుసుకున్నారు. శివరామకృష్ణ, ఖుద్దూస్, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురుడు చిత్ర విడుదల నేడు



నెల్లూరు(మినీబైపాస్): నగరానికి చెందిన కార్డియాలజిస్ట్ గురుప్రసాద్ కథానాయకుడిగా.. శివరామ ఆర్ట్స్ పతాకంపై నిర్మించిన మహిషాసురుడు చిత్రం శుక్రవారం విడుదల కానుందని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో చిత్రాన్ని నిర్మించారన్నారు. దర్శకుడు గోనుగుంట రవికుమార్, హాస్యనటుడు దోర్నాల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఇందిరమ్మ కాలనీలో గురువారం చోటు చేసుకొంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన గోవిందరాజ్ (50) కొంత కాలంగా ఇక్కడ నివసిస్తూ వివిధ ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. అతనికి ఆహారాన్ని చుట్టుపక్కల వారు అందించేవారు. సమీపంలోని వారు ఆహారం తీసుకెళ్లగా, ఇంట్లో ఆయన కనిపించలేదు. మరుగుదొడ్లో మరణించి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లీపురంలో చోరీ

నెల్లూరు రూరల్: అల్లీపురం సమీపంలోని మేకలవారితోటలో చోరీ జరిగింది. వివరాలు.. మేకలవారితోటకు చెందిన కామాక్షి దంపతులు కూలీ పనులు చేస్తుంటారు. పనులకెళ్లి గురువారం సాయంత్రం ఇంటికొచ్చిన వారు తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, తొమ్మిది గ్రాముల బంగారు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకున్నారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. నూతన జెడ్పీ కార్యాలయ ఎదురుగా గత నెల 19న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చాన్‌బాషా (60) రోడ్డుపై పడిపోయారు. అటుగా వెళ్తున్న వీఆర్వో బాషయ్య గమనించారు. వృద్ధుడి వివరాలను ఆరాతీయగా.. తనది బోగోలు మండలం ముంగమూరు అని చెప్పి స్పృహ కోల్పోయారు. చికిత్స నిమిత్తం 108 ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ ఎస్సై అబ్దుల్ రహీమ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.